క్లుప్తంగా

ఏలేరులో తగ్గిన నీటి నిల్వలు



ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: వేసవి నేపథ్యంలో స్థానిక ఏలేరు జలాశయంలో నీటినిల్వలు స్వల్పంగా తగ్గాయి. ఎగువ ప్రాంతం నుంచి నీటి సరాఫరా అంతంతమాత్రంగా ఉండడంతో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. ఆదివారం నాటికి ఏలేరు జలాశయంలో 86.56 మీటర్లకు గాను 68.87 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 3.77 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం పంట సాగు లేకపోవడంతో దిగువ ఆయకట్టుకు నీటి విడుదల నిలిపి వేశారు. విశాఖకు 175 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టుతో పాటు పంపా, తిమ్మరాజుచెరువుకు కూడా నీటి సరాఫరా నిలిపి వేశారు.

పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆంక్షలు

గోకవరం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పలు చోట్ల ఘర్షణలు, అల్లర్లు జరిగిన నేపథ్యంలో ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆంక్షలు విధించినట్టు గోకవరం ఎస్సై కె.నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డీజిల్, పెట్రోల్‌ను బాటిల్స్, టిన్నులు, డ్రమ్ముల్లోకి కొట్టడం పూర్తిగా నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమించిన బంకు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో విడిగా బాటిల్స్‌లో పెట్రోల్, డీజిల్ విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ బాణసంచా తయారీ, అమ్మకాలు, కొనుగోలు పూర్తిగా నిషేధమన్నారు. ఎక్కువ శబ్దం వచ్చే సైలెన్సర్లు అమర్చిన బైక్‌లను స్వాధీనం చేసుకుంటామన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా సూర్యదేవుని గ్రామోత్సవం



వీరలంకపల్లిలో సూర్యదేవుని గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని వీరలంకపల్లిలో ఉషాపద్మినీ ఛాయా సమేత సూర్యనారాయణ స్వామి గ్రామోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. సనాతన ధర్మ ప్రబోధనా స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో ఉదయం గ్రామస్తులు స్వామి, అమ్మవార్లను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట సాయిబాబు, అక్షింతల రాజా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం సూర్యనమస్కారాలు విధిగా చేయాలన్నారు. ఆదివారం మద్యం, మాంసానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీచినబాబు, సుంకర త్రిమూర్తులు, నంగిరెడ్డి అబ్బులు, మేడిద రమాదేవి, వెలిశెట్టి నాగసుధ, కొత్తపల్లి సత్యనారాయణ, పూసల వెంకటరమణ, పిల్లంగోరు పాపారావు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



ప్రత్తిపాడులో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం కార్యకర్తలు

ప్రత్తిపాడు: స్థానిక మార్కెట్ సెంటర్లో ఆదివారం స్వాతంత్ర సమరయోధుడు, కమ్యూనిస్ట్ ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిస్ట్ పార్టీకి సుందరయ్య చేసిన సేవలను కొనియాడారు. యువత, కార్మికులు సుందరయ్యను ఆదర్శంగా తీసుకుని కార్మిక హక్కుల, దేశ రక్షణ కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఏగులమ్మ అమ్మవారి ఆలయం వద్ద సీఐటీయూ కార్యకర్తలు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నెట్ల శ్రీను, అల్లాడి లక్ష్మి, పోసపల్లి రమణ, కొల్లి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

గొల్లప్రోలు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హనుమంతరావు హెచ్చరించారు. మండలంలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లోని ప్రజలతో ఆదివారం ఆయన సమావేశాలు నిర్వహించారు. కౌంటింగ్ రోజున గొడవలు జరగకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు అని, ఆ తర్వాత అందరూ అన్నదమ్ముల్లా మెలగాలన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక ఎవరైనా గ్రామాల్లో తగాదాలు సృష్టిస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

మామిడి రైతు దిగాలు

- సాగుకు కలిసిరాని వాతావరణం
- భారీగా తగ్గిన దిగుబడులు



గోకవరం మండలంలో మామిడి పండ్లను గ్రేడింగ్ చేస్తున్న రైతులు, కూలీలు

గోకవరం: మామిడి రైతులకు కాలం కలిసి రావడం లేదు. ఈ ఏడాదైనా కాలం కలిసి వచ్చి లాభాల బాట పడతామని ఆశపడ్డ రైతులకు చివరకు నిరాశే ఎదురైంది. మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంతో పాటు ఏజన్సీ ప్రాంతంలో రైతులు ఎక్కువగా మామిడి సాగు చేస్తారు. గతేడాది ప్రతికూల వాతావరణంతో మామిడి రైతులు నష్టాలు ఎదుర్కొన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో పూత ఆశాజనకంగా ఉండటంతో దిగుబడిపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. అయితే వాతావరణం అనుకూలించకపోవడంతో పూత మాడిపోయింది. రెండోసారి వచ్చిన పూతకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టగా ఎకరాకు పది శాతం మాత్రమే పూత నిలబడింది.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

జగ్గంపేట నియోజకవర్గంలోని జగ్గంపేట, గోకవరం, గండేపల్లి మండలాల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. జగ్గంపేట మండలంలో 800 హెక్టార్లలో, గోకవరం మండలంలో 1313, గండేపల్లి మండలంలో 450 హెక్టార్లలో రైతులు మామిడిని పండిస్తున్నారు. గోకవరం మండలంలో రంపయర్రంపాలెంలో అత్యధికంగా 495 హెక్టార్లు సాగవుతుండగా వెదురుపాక, తిరుమలాయపాలెం, గోకవరం, కష్టునిపాలెం పంచాయతీల పరిధిలో మామిడి సాగు జరుగుతోంది. అలాగే కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో, దేవీపట్నం, గంగవరం తదితర మండలాల్లో మామిడిని రైతులు అత్యధికంగా పండిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా కలక్టర్, బంగినపల్లి, చెరుకు రసాలు, పందారకల్తీ, కొత్తపల్లి కొబ్బరి, పందూరి మామిడి, తదితర రకాలను సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించిన పండ్ల రకాలను ఏటా మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బరంపురం, చెన్నై, ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం మామిడి తోటలను కౌలురైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎకరాను రూ.20 వేలు వరకు కౌలుకు తీసుకుని మరో రూ.10 వేలు పెట్టబడి పెడుతున్నారు. ఈ ఏడాది దిగుబడి బాగుంటుందని ఆశించిన రైతన్న ఆశలపై ప్రతికూల వాతావరణం నీళ్లు చల్లింది. దీంతో వరుసగా నష్టాలు చవిచూశారు.

మామిడి పండ్ల ధరలకు రెక్కలు

మామిడి పండ్లను చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ అందరూ ఎంతో ఇష్టంగా తింటారు. వేసవి వచ్చిందంటే చాలు మార్కెట్‌లో మామిడి పండ్ల కోసం జనం క్యూ కడతారు. కాగా ఈ ఏడాది మామిడిపండ్లు ధరలు ఆకాశాన్నంటాయి. దిగుబడి తక్కువగా ఉండటంతో దాని ప్రభావం ధర్పై పడింది. రసాలు, బంగినపల్లి రకాలకు పరక (13 పండ్లు) రూ.300 వరకూ ధర పలుకుతోంది.

తేనె మంచు ప్రభావం చూపింది



ఈ ఏడాది మామిడికి వాతావరణం అనుకూలించలేదు. ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుని దిగుబడి వచ్చిన సమయంలో తేనెమంచు ప్రభావంతో పూత పూర్తిగా మాడిపోయింది. పదిశాతం కూడా కాపు కాయ లేదు. తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలి.

– కొరిపల్లి అప్పలస్వామి, మామిడి రైతు, గోకవరం

కాకరాపల్లిలో 'అక్కడివారు-ఇక్కడున్నారు' చిత్ర బృందం సందడి



కోటనందూరులో మహర్షి రమణను సత్కరిస్తున్న చిత్రబృందం

కోటనందూరు: ఇటీవల విడుదలైన 'అక్కడివారు-ఇక్కడున్నారు' చిత్రం విజయయాత్రలో భాగంగా ఆదివారం చిత్రబృందం మండలంలోని కాకరాపల్లిలో సినిమా కేంద్రాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు, నిర్మాత త్రివిక్రమ్ కుందుర్తి మాట్లాడుతూ ఈ చిత్రం షూటింగ్‌ను కోటనందూరు మండలం బొద్దవరంలో 20 రోజులు పాటు చేశామన్నారు. ఈ ప్రాంత నటీనటులు ఎక్కువమందికి ఈ సినిమాలో అవకాశం కల్పించామన్నారు. కథే ప్రాధాన్యంగా నిర్మించిన ఈ చిన్న సినిమాకు ప్రేక్షకులు పెద్ద విజయం కట్టబెట్టడం ఆనందంగా ఉందన్నారు. ఈ సినిమాలో నటించిన మహర్షి రమణను కోటనందూరులోని ఆయన స్వగృహానికి వెళ్లి సత్కరించారు. కార్యక్రమంలో తాండవ సుగర్స్ విశ్రాంత సీడీఓ కేవీ రమణ, గుంటూరుకు చెందిన న్యాయవాది విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



జగ్గంపేటలో ఎన్నికల పోలింగ్ సరళిపై పార్టీ నాయకులతో సమీక్షిస్తున్న తోట నరసింహం

- ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం
- పోలింగ్ సరళిపై పార్టీ శ్రేణులతో సమీక్ష

జగ్గంపేట: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని, జగ్గంపేట నియోజకవర్గంలో హ్యాట్రిక్ సాధిస్తామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. స్థానిక బాలాజీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎన్నికల పోలింగ్ సరళి, గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. రాష్ట్రంలో ఫలితాలు ఎవరు ఊహించని విధంగా వస్తాయని, ప్రజలు వైఎస్సార్ సీపీకి జేజేలు పలుకుతారని ధీమా వ్యక్తం చేశారు. పేదలు, మహిళలు వైఎస్సార్ సీపీకే ఓటు వేశారన్నారు. నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో గెలుపుపై సందేహాలు పెట్టుకోవద్దన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో ఉన్నాయని, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలంతా మనవైపే ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త అత్తులూరి సాయిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, రామకుర్తి జగాల్, కాపారపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ



ఏలేశ్వరం గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు రామ్‌ప్రసాద్

ఏలేశ్వరం: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు బంటుపల్లి రామ్‌ప్రసాద్ స్పోకెన్ ఇంగ్లిషు, నీతికథలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రత్తిపాడు రూరల్: విద్యార్థులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ వి.సన్యాసి సూచించారు. మండలంలోని ధర్మవరం గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సన్యాసి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి జూన్ 7 వరకూ వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించడమే కాకుండా కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిషు, డ్రాయింగ్ పోటీలు వంటి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రత్నగిరిపై అలరించిన పుష్పాలంకరణ



సత్యదేవుని ఆలయం వద్ద పుష్పాలంకరణ



స్వామివారి ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



స్వామివారి అనివేటి మండపంలో వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రత్నగిరిపై చేసిన పుష్పాలంకరణ భక్తులు విశేషంగా ఆకట్టుకుంది. స్వామివారి ప్రధానాలయం, క్యూ లైన్లు, ధ్వజస్తంభం, అనివేటి మండపం వద్ద చేసిన అలంకరణ భక్తులను ఎంతగానో అలరించింది. భక్తులు ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు.

కల్యాణం.. కమనీయం

- కన్నులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణాలు
- భక్తిశ్రద్ధలతో తిలకించిన భక్తులు



తంటికొండలో వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రాంగణంలోని మండపంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, వేదమంత్రాల నడుమ స్వామివారి కల్యాణ వేడుకను కన్నుల పండువగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణం జరిపారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విశేష సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. రాత్రికి ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ గండి వెంకటలక్ష్మీకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం తొమ్మిది గంటలకు గోపికా పూజ, సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. రాత్రికి పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో శ్రీనివాస కల్యాణం నిర్వహించి, తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు.

నేడు లక్ష్మీనారాయణ వ్రతం

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు లక్ష్మీనారాయణ వ్రతం, సాయంత్రం ఏడు గంటలకు శ్రీకృష్ణతులాభారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చిల్లంగిలో..

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగిలో ఏలేరు నది ఒడ్డున వేంచేసిన వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ పండితులు ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం వేద మంత్రాలు, బాజాభజంత్రీల నడుమ స్వామివారి కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.



కిర్లంపూడిలో వేణుగోపాలస్వామి కల్యాణం

కిర్లంపూడిలో వేణుగోపాలస్వామి కల్యాణం

కిర్లంపూడిలో వేంచేసిన రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



చిల్లంగిలో వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు



ఎస్.అన్నవరంలో శ్రీవారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కత్తిపూడిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



కత్తిపూడిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

హోరు వాన

ఏలేశ్వరం: పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఏలేశ్వరంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. కొద్దిరోజులుగా ఎండలతో అల్లాడుతున్న ప్రజలు ఒక్కసారిగా భారీవర్షం పడడంతో ఉపశమనం పొందారు. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండటంతో వృద్ధులు, పిల్లలు అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో వర్షం కురిసింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో వారంరోజులుగా అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. వచ్చే నెల మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని వాతావరణశాఖ తెలపడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో ఉపశమనం

ప్రత్తిపాడు రూరల్: మండలవ్యాప్తంగా ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎంత తీవ్రత కొనసాగింది. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. ఈదురుగాలులతో వర్షం కురవడంతో ఎండ నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. గత రెండు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో అల్లాడిపోయిన ప్రజలు ప్రస్తుతం వాతావరణం చల్లబడటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. నైరుతి రుతుపవనాలు ముందుస్తుగా రాష్ట్రంలోకి ప్రవేశించనున్నట్లు వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించడంతో రైతులు ఖరీఫ్ పనులకు సన్నద్ధమవుతున్నారు.



ఏలేశ్వరంలో దట్టంగా అలుముకొన్న కారుమబ్బులు



ప్రత్తిపాడులో రహదారిపై గొడుగులతో వెళుతున్న మహిళలు

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత పరిశీలన



స్ట్రాంగ్ రూముల వద్ద లాగ్‌బుక్‌లో సంతకాలు చేస్తున్న కలెక్టర్ నివాస్, ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ సిటీ: కాకినాడ జేఎన్‌టీయూలో భద్రపరిచిన ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత, నిఘా వ్యవస్థకు సంబంధించిన, కౌంటింగ్ ఏర్పాట్లను ఆదివారం రాత్రి జిల్లా కలెక్టర్ జె.నివాస్, జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి జేఎన్‌టీయూ ఇండోర్ స్టేడియంలో ఉన్న ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పెద్దాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, పెద్దాపురం ఆర్డీవో జె.సీతారామరావు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

పిఠాపురం ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను..

కాకినాడ సిటీ: పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి ఆదివారం రాత్రి జేఎన్‌టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలోని ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమును సందర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూముకు వెళ్లి అక్కడి భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.